

బీఆర్‌ఎస్‌లో గందరగోళం



- ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలపై కాంగ్రెస్ దృష్టి
- మార్పు బాటలో మరికొందరు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

ఇంతకాలం అధికారాన్ని అనుభవించి ఆ అధికారం చేజారగానే కాంగ్రెస్‌లో చేరేందుకు నేతలు వరుస కడుతుండడం బీఆర్‌ఎస్ ఉమ్మడి జిల్లా వర్గాల్లో కలవరం రేపుతున్నది. వారంరోజుల క్రితం ఒక ఎమ్మెల్యే, నిన్న ఒక ఎమ్మెల్సీ బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్ కండువా కప్పుకోవడంతో తరువాత ఎవరు పార్టీ మారనున్నారో, ఇంకెవరెవరు వరుసలో ఉన్నారో అంటూ చర్చలు జరుగుతున్నాయి. దీంతో ఆ పార్టీశ్రేణులు గందరగోళంలో పడిపోవడమే కాకుండా పార్టీ పరిస్థితి ఏమిటీ అంటూ చర్చించుకుంటున్నారు.

● ఇప్పటికే ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ..

ఉమ్మడి జిల్లాలోని జగిత్యాల బీఆర్‌ఎస్ శాసనసభ్యుడు డాక్టర్ సంజయ్‌కుమార్ ఇటీవల పార్టీకి రాజీనామా చేసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. గురువారం అర్ధరాత్రి పెద్దపల్లికి చెందిన ఎమ్మెల్సీ టి భానుప్రసాద్‌రావు కాంగ్రెస్ బాటపట్టారు. జిల్లాలో బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన ఎమ్మెల్సీలు మరెవరూ లేక పోయినా ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన ఎమ్మెల్యేలు మరికొందరు ఉన్నారు. వారిలో కొందరిపై పార్టీ మారే అవకాశాలున్నాయంటూ చర్చలు జరుగుతున్నాయి. బీఆర్‌ఎస్ కార్యనిర్వహక అధ్యక్షుడు కేటీ రామారావు సిరిసిల్ల శాసనసభ్యుడిగా గెలుపొందగా, మాజీ మంత్రి, గంగుల కమలాకర్ కరీంనగర్ నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. హుజూరాబాద్ నుంచి పాడి కౌశిక్‌రెడ్డి గెలు పొందారు. కోరుట్ల నుంచి డాక్టర్ సంజయ్ కూడా బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేగా గెలిచి ప్రాతి నిధ్యం వహిస్తున్నారు.

● మేయర్, కార్పొరేటర్ల పార్టీ మార్పుపై ఊహాగానాలు

ఉమ్మడి జిల్లా రాజకీయ కేంద్రమైన కరీంనగర్ కార్పొరేషన్‌లో మేయర్ సునీల్ రావు బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లోగానీ, బీజేపీలోగాని చేరే అవకాశాలున్నాయని ప్రచా రం జరుగుతోంది. ఆయన బీజేపీలోకి వెళ్ల వచ్చనే ప్రచారమే బలంగా ఉంది. కార్పొ రేషన్‌లోని 12 మంది కార్పొరేటర్లు ఇప్పటికే కాంగ్రెస్‌లో చేరగా, ఎనిమిది మంది బీజేపీ లోకి వెళ్లారు. మరో ఆరుగురు కార్పొ రేటర్లు కాంగ్రెస్‌లో చేరే అవకాశాలున్నా యని తెలిసిందిది. జడ్పీటీసీలు, ఎంపీపీలు కొందరు ఇప్పటికే కాంగ్రెస్‌లో చేరారు. వారి పదవీ కాలం పూర్తికావడంతో మాజీలుగా వారు పార్టీని వీడినా పెద్దగా ప్రభావం ఉంటుందా లేదా అన్నది వారి వ్యక్తిగత సంబంధాలను బట్టి ఉంటుందే తప్ప పార్టీ ప్రభావం ఉండక పోవచ్చు. ఇలా పార్టీలో బడా నేతలుగా కొనసాగిన వారందరూ అధికారపార్టీ అయిన కాంగ్రెస్ వైపు, మరికొందరు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ వైపు మొగ్గు చూపుతుండడం ఆయా పార్టీల్లో చేరేందుకు సిద్ధమవుతుండడం బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణుల్లో కలవరం రేపుతున్నది. పార్టీ అధినేత కేసీఆర్ జిల్లాకు చెందిన నేతలందరిని పిలిపించుకొని అధైర్యపడవద్దని, రాబోయే రోజులు తమవే అంటూ ధీమాను కల్పించినా పార్టీనేతల ఆలోచనల్లో పెద్దగా మార్పురాక పోవడం చూసి స్థానిక ఎన్నికల నాటికి పోటీచేసే వారుంటారా లేదా అనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. సోషల్ మీడియాలో, ప్రధాన మీడియాలో పార్టీపై, పార్టీ నేతల రాజీనామాలపై అగ్రనేతల ఆలోచనలపై వస్తున్న వార్తలు వారిని తీవ్ర ఆందోళనకు గురిచేస్తూ గందరగోళంలో పడవేస్తున్నాయి. పార్టీ ఉనికిపై కూడా పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తుండడంతో నాయకత్వం నుంచి స్పష్టమైన ప్రకటన వస్తే బాగుండనే అభిప్రాయాన్ని పలువురు బీఆర్‌ఎస్ ద్వితీయశ్రేణి నేతలు, కార్యకర్తలు వ్యక్తం చేస్తున్నారు.

నెక్ట్స్ ఎవరు?

జగిత్యాల నుంచి గెలిచిన సంజయ్‌కుమార్ ఇటీవల కాంగ్రెస్‌లో చేరారు. కేటీ రామారావు సన్నిహిత మిత్రుడైన కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ పార్టీ మారే అవకాశం ఉండక పోవచ్చని భావిస్తున్నారు. కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరే అవకాశం ఉన్నదని ఎన్నికలుజరిగిన నెలరోజుల నుంచే చర్చించుకోవడం ప్రారంభమైంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి గంగుల కమలాకర్‌కు తెలుగుదేశం హయాం నుంచి సన్నిహిత సంబంధాలున్నాయని, వారిద్దరు తరచుగా ఒకరితో ఒకరు మాట్లాడుకుంటారని ప్రచారంలో ఉంది. పాడి కౌశిక్‌రెడ్డి సమీపబంధువైన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కాంగ్రెస్ మంత్రి వర్గంలో కీలకమైన వ్యక్తిగా ఉండడం, గతంలో పాడి కౌశిక్‌రెడ్డి కాంగ్రెస్‌లోనే ఉండడం, హుజూరాబాద్ నుంచి పోటీచేసిన నేపథ్యం ఉండడంతో ఆయన కూడా కాంగ్రెస్‌కు వెళ్తారంటూ ప్రచారం జరిగింది. వీరిద్దరూ ఆ ప్రచారాన్ని ఖండిస్తూ పార్టీ మారేది లేదని చెప్పినా ఇంకా చర్చకు మాత్రం తెరపడడం లేదు. పాడి కౌశిక్‌రెడ్డి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేగా తన నియోజకవర్గంలో పార్టీ ఉనికి కోసం, తన ఉనికికోసం ఏదో ఒక ప్రయత్నం చేస్తూ చర్చల్లో ఉంటున్నారు. దీంతో ఆయన బీఆర్‌ఎస్‌కు వీడక పోవచ్చని అందరూ భావిస్తున్నారు. మాజీ మంత్రి గంగుల కమలాకర్ నుంచి పార్టీ మారేది లేదంటూ బలమైన ప్రకటన కానీ, ఆచరణకాని వ్యక్తం కాక పోవడంతో ఇంకా అనుమానాలు కొనసాగుతున్నాయి.

తరగతి గదిలోకి ఉపాధ్యాయులు సెల్‌ఫోన్ తీసుకెళ్లొద్దు..

● జిల్లా విద్యాశాఖాధికారి సీహెచ్‌వీఎస్ జనార్దన్‌రావు



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న డీఈవో జనార్దన్‌రావు

హుజూరాబాద్‌రూరల్, జూలై 6: తరగతి గదుల్లోకి ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపాధ్యాయులు సెల్‌ఫోన్ తీసుకెళ్లొద్దని జిల్లా విద్యాశాఖాధికారి సీహెచ్‌వీఎస్ జనార్దన్‌రావు అన్నారు. మండలంలోని సిర్సపల్లి జిల్లా పరిషత్ పాఠశాలను ఆయన శనివారం సందర్శించి అకాడమిక్ గైడెన్స్ అమలు తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడారు. ఉచిత పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్, నోటుబుక్స్ అందిరికీ ఇచ్చారా అని హెచ్‌ఎంను ప్రశ్నించారు. అనంతరం ఉపాధ్యాయులతో మాట్లాడారు. ప్రభుత్వం విడుదల చేసిన గైడెలెన్స్ ప్రకారంగా విద్యాబోధన జరుపాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సెక్టోరల్ అధికారి కర్ర అశోక్‌రెడ్డి, హెచ్‌ఎం వీడపు శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● **హుజూరాబాద్:** హుజూరాబాద్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను శనివారం జిల్లా విద్యాశాఖ అధికారి జనార్దన్‌రావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు, సలహాలు చేశారు ఉపాధ్యాయులు పాఠశాలలో అవసరమైతే తప్ప సెల్‌ఫోన్లను వాడొద్దన్నారు. సమావేశంలో ఏఎంవో అశోక్‌రెడ్డి, ఇన్‌చార్జీ హెచ్‌ఎం సత్యప్రసాద్, ఉపాధ్యాయులు ప్రవీణ్, సమ్మయ్య, సాయి, నాగమణి, సంపత్, అరుణ్‌కుమార్, వెంకటేష్, అనిత పాల్గొన్నారు.

దేశ సమైక్యతకు ప్రాణాలర్పించిన శ్యామాప్రసాద్ ముఖర్జీ

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న గంగాడి కృష్ణారెడ్డి

జమ్మికుంట, జూలై 6: దేశ సమైక్యత కోసం ప్రాణాలర్పించిన గొప్ప వ్యక్తి డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ అని బీజేపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. శనివారం జమ్మికుంట పట్టణంలోని శ్రీ సరస్వతి శిశుమందిర్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో భారతీయ జన సంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతిని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గంగాడి కృష్ణారెడ్డి శ్యామాప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో రెండు రాజ్యాంగాలు, రెండు పథకాలు, ఇద్దరు ప్రధానులు ఉండకూడదని గర్జించి నిరంతరం దేశం కోసం తపించిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. కశ్మీర్‌లో 370ఆర్టికల్ రద్దు కోసం ఎనలేని పోరాటం చేశారన్నారు. ఆయన కళలను ప్రధానమంత్రి నరేంద్రమోదీ నెరవేర్చారన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ఎరబెల్లి సంపత్‌రావు, పట్టణ అధ్యక్షుడు జీడి మల్లేష్, మున్సిపల్ మాజీ చైర్మన్ శీలం శ్రీనివాస్, మాజీ జడ్పీటీసీ డాక్టర్ శ్రీరామ్ శ్యామ్, నాయకులు రావుల కుమార్, పల్లపు రవి పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రి కార్మికుల సమ్మె విరమణ

సమస్యలు పరిష్కస్తామని అధికారుల హామీ



ఆసుపత్రి ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

సుభాష్‌నగర్, జూలై 6: పెండింగ్ వేతనాలు చెల్లించాలని కోరుతూ ప్రభుత్వ ఆసుపత్రి కార్మికులు చేపట్టిన సమ్మెను శనివారం విరమించారు. మూడు నెలలుగా వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని, వెంటనే చెల్లించాలని, కార్మికుల పట్ల సూపర్‌వైజర్ల వేదింపులు ఆపాలని, పీఎఫ్ డబ్బులు కార్మికుల ఖాతాలో జమ చేయాలని కోరుతూ రెండు రోజులుగా కార్మికులు సమ్మె చేస్తున్నారు. శనివారం ఉదయం ఆసుపత్రి ఎదుట ధర్నా చేసిన నిరసన తెలిపారు. ఈ సదర్భంగా ప్రభుత్వ ఆసుపత్రి వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు బండారి శేఖర్ మాట్లాడుతూ మూడు నెలలుగా వేతనాలు రాకపోవడంతో పేషంట్ కేర్, సానిటేషన్, సెక్యూరిటీ గార్డ్స్ చాలా ఇబ్బందులు పడ్డారని తెలిపారు. ఈ విషయాన్ని ఏజిల్ సంస్థ ప్రతినిధుల దృష్టికి చాలా సార్లు తీసుకెళ్లామని, అయినా వేతనాలు చెల్లించలేదన్నారు. కార్మికులు రెగ్యులర్‌గా డ్యూటికి వస్తున్నా సూపర్‌వైజర్లు వేధిస్తున్నారన్నారు. పది నిమిషాలు లేటుగా వస్తే అదనంగా గంట నుంచి రెండు గంటల వరకు పని చేయించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వీరారెడ్డి, ఏజిల్ గ్రూపు ప్రతినిధులు, కార్మికులతో చర్చలు జరిపారు. వారి సమస్యలను పరిష్కరిస్తామని సూపరింటెండెంట్, ఏజిల్ సంస్థ ప్రతినిధులు హామీ ఇవ్వడంతో కార్మికులు సమ్మె విరమించారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు అరుణ్, కార్యదర్శి కళావతి, ఉపాధ్యక్షురాలు శారద, సరళ, రాజు, నరేష్, సతీష్ పాల్గొన్నారు.

బంజారాల సంస్కృతికి ప్రతీక తీజ్



తీజ్ ఉత్సవాల్లో పాల్గొన్న బంజారా విద్యార్థులు

గణేశ్‌నగర్, జూలై 6: బంజారాల సంస్కృతికి ప్రతీక తీజ్ ఉత్సవాలని కొత్తపల్లి మాజీ ఎంపీపీ భూక్య తిరుపతినాయక్ అన్నారు. శాతవాహన యూనివర్సిటీలో బంజారా విద్యార్థులు నిర్వహించిన తీజ్ ఉత్సవాలు శనివారంతో ముగిశాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భూక్య తిరుపతినాయక్ మాట్లాడుతూ విద్యార్థులు తమ సాంప్రదాయాలకు అనుగుణంగా ఉత్సవాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ వరప్రసాద్, శ్రావణ్‌నాయక్, విట్టల్ మహారాజ్, భాస్కర్ మహారాజ్, సుధాకర్ నాయక్, విద్యార్థులు పాల్గొన్నారు.

కాల్వ నర్సయ్యయాదవ్ సేవలు చిరస్మరణీయం

● సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి



కాల్వ నర్సయ్యయాదవ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి

కరీంనగర్ రూరల్, జూలై 6: కార్మిక, కమ్యూనిస్టు ఉద్యమ నేత కాల్వ నర్సయ్యయాదవ్ సేవలు చిరస్మరణీయమని సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి అన్నారు. శనివారం కాల్వ నర్సయ్య యాదవ్ వర్ధంతి సందర్భంగా కరీంనగర్ రూరల్ మండలం బొమ్మకల్ గ్రామంలో నర్సయ్య యాదవ స్మారక స్థూపం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బైపాస్ రోడ్డుగల ఆయన విగ్రమానికి పూలమాల వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాల్వనర్సయ్య యాదవ్ అనేక సంవత్సరాలపాటు కార్మికులకు, కర్షకులకు, కమ్యూనిస్టు పార్టీకి విశేష సేవలు అందించారన్నారు. ఎక్కడ ఉన్నా సమస్య పరిష్కారం కోసం పని చేసే వాడని, దురదృష్టవశాత్తు ఐదుసంవత్సరాల క్రితం నర్సయ్య యాదవ్ మృతి చెందడం కార్మికులకు, కష్ట జీవులకు, గొల్ల కురుమ వర్గానికి తీరని లోటన్నారు. ఆయన ఆశయాల సాధనకు సీపీఐ శ్రేణులు, ఏఐటీయూసి కార్మిక నాయకులు, కార్మికులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పొనగంటి కేదారి, నియోజకవర్గ కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు కొయ్యడ సృజన్‌కుమార్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కటికరెడ్డి బుచ్చన్న యాదవ్, సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు పైడిపెల్లి రాజు, బూడిద సదాశి, నలువాల సదానందం, ఏఐటీయూసీ నాయకులు జంగం తిరుపతి, కాశెట్టి లక్ష్మణ్, సాయవేని రాజమల్లు, వీరయ్య సంపత్, నర్సయ్య, కుటుంబ సభ్యులు కాల్వ లక్ష్మీ శ్రీనివాస్, జ్యోతి, నవీన్ యాదవ్, మల్లేశం, కుర్మ సంఘం నాయకులు కడారి అయిలయ్య, బండి మల్లేశం, మంచాల రవి పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర గొర్రెల మేకల పెంపకం వృత్తిదారుల సంఘం వ్యవస్థాపకుడు కాల్వ నర్సయ్య యాదవ్ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి పురమల్ల శ్రీనివాస్ ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు.

చట్టాల మార్పు రాజ్యాంగ విరుద్ధం



మాట్లాడుతున్న మాజీ ఎంపీ వినోద్ కుమార్

సుభాష్‌నగర్, జూలై 6: మార్చిన చట్టాలకు హిందీలో పేరు పెట్టారని, ఇది రాజ్యాంగ విరుద్ధమని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. కరీంనగర్ ఫిలింభవన్‌లో ప్రజామిత్ర ప్రోగ్రెసివ్ డెమెక్రటిక్ ఫ్రంట్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు కొరివి వేణుగోపాల్ ఆధ్వర్యంలో చట్టాల మార్పుపై రౌండ్‌టేబుల్ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వినోద్‌కుమార్ మాట్లాడుతూ ఇండియన్ పీనల్ కోడ్, ఇండియన్ క్రిమినల్ ప్రొసీజర్, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ వంటి మేజర్ క్రిమినల్ చట్టాలు అమల్లో ఉన్నాయని తెలిపారు. ఇవి బ్రిటీష్ పాలనలో అమల్లోకి తెచ్చారని స్వాతంత్ర్యం వచ్చిన తరువాత కూడా అమలవుతున్నాయన్నారు. బ్రిటీష్ చట్టాలను మారుస్తున్నామని మోదీ ప్రభుత్వం గర్వంగా చెప్పుకుందన్నారు. చట్టాల్లో ఎలాంటి మార్పు చేశారో మోదీ సర్కారు చెప్పాలన్నారు. చాల సెక్షన్లలో ఫుల్‌స్టాప్, కామా కూడా మార్చలేదన్నారు. కొత్త సీసాలో పాత సారా అన్న చందంగా ఈ చట్టాల పేర్లు మార్చారని అన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 348 ప్రకారం భారత పార్లమెంట్ ఏ చట్టాలు చేసినా ఇంగ్లీష్‌లో తప్పనిసరిగా ఉండాలని ఉందని తెలిపారు. చట్టాల మార్పుపై ఇప్పటికే కేరళ, తమిళనాడులో కేసు వేశారన్నారు. పేర్లు మార్చడం ద్వారా స్పిరిట్ ఆఫ్ ది యాక్ట్‌ను ఉల్లంఘించారన్నారు. నేరం జరిగిన 24 గంటల్లో ఎఫ్ఐఆర్ బుక్ చేయాలని, కాని కొత్త చట్టం ప్రకారం విచారణ పేరుతో పోలీసులు జాప్యం చేసే ప్రమాదం ఉందని తెలిపారు. ఏడేళ్లలోపు జైలు శిక్షపడే అవకాశం ఉన్న కేసుల్లో స్టేషన్ బెయిల్ ఇవ్వాలనే రూలు ఉందని, కాని ఇపుడు ఇది లేకుండా చేశారని, దీంతో స్టేషన్ హౌస్ ఆఫీసర్లు జైలుకు పంపిస్తామని బెదిరింపులకు పాల్పడే అవకాశం ఉందన్నారు. అనంతరం ప్రజామిత్ర రాష్ట్ర అధ్యక్షుడు కొరివి వేణుగోపాల్ మాట్లాడుతూ జ్యుడీషియ్ కస్టడీలో ఉన్న నిందితుడిని 14 రోజుల్లోనే పోలీసు కస్టడీ కోరాలని ఉందని, కొత్త చట్టాల ప్రకారం ఇపుడు 90 రోజుల్లోపు కస్టడీ కోరే అవకాశాన్ని పోలీసులకు కల్పించారని తెలిపారు. ఇప్పటికే ఈ చట్టాల్లోని లోపాలపై 50 పేజీల అఫిడవిట్ సుప్రీం కోర్టులో ఫైల్ చేశానని తెలిపారు. రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ నిమ్మ నారాయణ మాట్లాడుతూ జూన్ 30 వరకు నమోదైన కేసులన్నీ పాత చట్టాల ప్రకారమే కోర్టులో నడుస్తాయని, జూలై 1 నుంచి నమోదయ్యే కేసులన్ని కొత్త చట్టాలతో నడుస్తాయని తెలిపారు. కొత్త చటాల్లో క్రూరమైన నిబంధనలు తెచ్చారన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్ పాల్గొన్నారు.

ధ్వంసమైన డ్రైనేజీ

- రాకపోకలకు వాహనదారుల అవస్థలు

- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

జమ్మికుంట, జూలై 6: జమ్మికుంట పట్టణంలోని గాంధీ చౌరస్తా నుంచి పాత కూరగాయాల మార్కెట్ వెళ్లే ప్రధాన మార్గంలో డ్రైనేజీ పూర్తిగా ధ్వంసమైంది. రోడ్డు ఇరుకుగా మారడంతో అటువైపు వెళ్లే వాహనాల రాక పోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది.. ఎఫ్‌సీఐ, నూతన వ్యవసాయ మార్కెట్, రైస్ మిల్లులకు ఈ రోడ్డు నుంచే వెళ్లాల్సి ఉంటుంది. అధిక లోడుతో వచ్చే భారీ వాహనాలు, ఆర్టీసీ బస్సులు, వ్యవసాయ ఉత్పత్తులు తీసుకు వెళ్లే ట్రాలీలు, ఇసుక ట్రాక్టర్ల రాక పోకలతో రోడ్డు మార్గం నిత్యం రద్దీగా ఉంటుంది. వీటికి తోడు చికెన్ సెంటర్లు, ఎగ్ సెంటర్లు, కిరాణ షాపులు అటువైపు ఎక్కువగా ఉన్నాయి. కోరపల్లి, విలాసాగర్, బిజిగిరిషరీఫ్, పోతిరెడ్డిపల్లి, కొండపాక గ్రామాలకు ఈ ప్రాంతం నుంచే రాకపోకలు సాగిస్తుంటారు. సాధారణంగానే కూరగాయాల మార్కెట్ రోడ్డు ఇరుకుగా ఉటుంది. దీనికితోడు కాల్వ ధ్వంసం కావడంతో రోడ్డు మరింత ఇరుకుగా మారింది. భారీ వాహనాలు వచ్చిన సమయంలో రాకపోకలకు స్థానికులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



కూరగాయల మార్కెట్‌కు వెళ్లే దారిలో ధ్వంసమైన డ్రైనేజీ

విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టాలి

- జూనియర్ సివిల్ జడ్జి పద్మ సాయిశ్రీ

హుజూరాబాద్, జూలై 6: విద్యార్థులు నేరాల వైపుకి వెళ్లకుండా చదువుపై దృష్టి పెట్టాలని హుజూరాబాద్ కోర్టు మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి పద్మ సాయిశ్రీ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జిల్లా మహిళ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శనివారం నూతన శిక్ష చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జడ్జి పద్మ సాయిశ్రీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఇటీవలే నూతనంగా వచ్చిన శిక్ష చట్టాల గురించి తెలుసుకోవాలని సూచించారు. యువత లక్ష్యం ఏర్పారుచుకొని సాధించాలని తెలిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తిరుమల, మహిళ సాధికారత జిల్లా కో-ఆర్డినేటర్ శ్రీలత, ఫైనాన్షియల్ లిట్రసి రోహిణి, సఖి లీగల్ కౌన్సిలర్ సంధ్యారాణి, కళాశాల ప్రిన్సిపాల్ నిర్మల, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న డబుల్ రోడ్డు పనులు



గునుకుల కొండాపూర్ వరకు చేపడుతున్న రోడ్డు పనులు

గన్నేరువరం, జూలై 6: గుండ్లపల్లి నుంచి గన్నేరువరం మీదుగా ఇల్లంతకుంట మండలం పొత్తూరు వరకు 71 కోట్ల రూపాయలతో మంజూరైన డబుల్ రోడ్డు పనులు ఎట్టకేలకు కొన సాగుతున్నాయి. మొత్తం 21కిలోమీటర్ల మేర 33ఫీట్ల తారు రోడ్డు వేయనున్నారు. ప్రస్తుతం గునుకుల కొండాపూర్ వరకు వరకు రోడ్డు పనులు వేగంగా కొనసాగుతున్నాయని ఆర్ అండ్ బీ అధికారులు తెలిపారు. గన్నేరువరం మండలంగా ఏర్పాటు కాకముందు ఈ రో డ్డుపై వాహనాలు పెద్దగా వెళ్లేవి కావు. ప్రస్తుతం మండలంగా ఏర్పడ్డ గన్నేరువరం నుంచి వాహనాల రాకపోకలు పెరిగాయి. ఇటీవలి వరకు రోడ్డుపై గుంతలు ఉండడంతో వాహనదా రులు ఇబ్బందులు పడ్డారు. స్థానికుల విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో పనులు ప్రారంభించారు.

కబ్జాదారులపై పోలీసులకు ఫిర్యాదు

రామడుగు, జూలై 6: మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామంలో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనం కబ్జాకు పాల్పడిన వ్యక్తులపై పోలీస్ స్టేసన్‌లో ఫిర్యాదు చేసినట్లు పంచాయతీ కార్యదర్శి తెలిపారు. పల్లె ప్రకృతి వనంలోని ఫెన్సింగ్‌ను తొలగించారని తెలిపారు. తిరిగి శనివారం గ్రామపంచాయతీ సిబ్బందితో కంచెను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దీనిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

నాటిన చోటే మళ్లీ గుంతలు

- మొక్కలు పెట్టి సంరక్షణ మరిచిన అధికారులు



చిగురుమామిడి గ్రామ శివారులో తీసిన గుంతలు

చిగురుమామిడి, జూలై 6: మండల వ్యాప్తంగా గత ప్రభుత్వం హయాంలో హరితహారం కార్యక్రమంలో నాటిన మొక్కల సంరక్షణకు అధికారులు చర్యలు తీసుకోలేదు. దీంతో మొక్కలు ఎండిపోయాయి. ఈ ఏడాది మళ్లీ ఆ ప్రాంతాల్లోనే మొక్కలు నాటేందుకు గుంతలు తీస్తుండడంపై ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రం శివారులో ఉన్న పామ్‌బండ వద్ద మాజీ సీఎం కేసీఆర్ ఎంతో అట్టహసంగా హరితహారం కార్యక్రమంలో భాగంగా 2015 ఆగస్టులో మొక్కలు నాటారు. అధికారులు పట్టించుకోక పోవడంతో అన్ని మొక్కలు ఎండి పోయాయి. దీంతో లక్షలాది రూపాయలు ప్రజల సొమ్ము వృథా అయిందని స్థానికంగా విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం ఈ ఏడాది మళ్లీ అధికారులు విధించిన లక్ష్యం చేరుకునేందుకు ఆ ప్రాంతంలో మొక్కలు నాటేందుకు గుంతలు సిద్ధం చేస్తున్నారు. మండలంలో ఈ ఏడాది 53,900 మొక్కలు నాటాల్సి ఉంది.. దీని కోసం అధికారులు ఉపాధి హామీ పథకం ద్వారా కూలీల చేత గుంతలు తీసి సిద్ధం చేస్తున్నారు. మొక్కలు నాటి సంరక్షణకు కంచేలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



నర్సరీలో సిద్ధంగా ఉన్న మొక్కలు

ఐక్య ఉద్యమాలు నిర్వహించాలి

జమ్మికుంట, జూలై 6: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై ఐక్య ఉద్యమాలు నిర్వహించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి అన్నారు. పట్టణంలో శనివారం సీపీఎం రాజకీయ శిక్షణ తరగతులు ప్రారంభమ య్యాయి. ప్రిన్సిపాల్‌గా జిల్లా కమిటీ సభ్యులు శీలం అశోక్ వ్యవహరించారు. కార్యక్రమానికి ముఖ్యతిథిగా హాజరైన వాసుదేవరెడ్డి మాట్లాడుతూ దేశంలో మతోన్మాదం రోజు రోజుకు పెరిగి పోతుందన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసిన మ్యాజిక్ ఫిగర్ రాలేదన్నారు. 400సీట్లు సాధించి రాజ్యాంగాన్ని మారుస్తామని, రిజర్వేషన్లు సవరిస్తామని చెప్పిన మాటలను ప్రజలు తిరస్కరించి 240సీట్లకు పరిమితం చేశారని చెప్పారు.. ఎన్డీఏ పక్షాలను కలుపుకొని నరేంద్ర మోదీ ప్రధాని అయ్యారని చెప్పారు. ఇది పూర్తి కాలం నిలబడే ప్రభుత్వం కాదన్నారు. బీజేపీ ఒంటెత్తు పోకడలను మిత్ర పక్షాలు భరించలేక ఏ క్షణంలో అయిన వైదొలిగే అవకాశం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన అరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం బొగ్గు బ్లాకుల వేలం రద్దు చేయాలని, నేరుగా సింగరేణికి కేటాయించాలని కోరారు. ఇప్పటికే బీజేపీ ప్రభుత్వం 200బొగ్గు బ్లాకులను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించిందని తెలిపారు. సమావేశంలో వెలమరెడ్డి రాజిరెడ్డి, కొప్పుల శంకర్, బాసిర సందప్‌రావు, దండిగారి సతీష్, చెల్పూరి రాములు, వడ్లూరి కిషోర్, రాజు, వసుదేవ్, రమేశ్, రాజకుమారి, మధునయ్య, వెంకన్న పాల్గొన్నారు.

సామాజిక శాస్త్రాలను లోతుగా అధ్యయనం చేయాలి



మాట్లాడుతున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ మధుసూదన్‌రెడ్డి

జమ్మికుంట, జూలై 6: సామాజిక శాస్త్రాలను లోతుగా అధ్యయనం చేయాలని హనుమకొండ కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల పొలిటికల్ సైన్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఏ మధుసూదన్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం సామాజిక శాస్త్రాల జ్ఞానశాస్త్రం అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యతిథిగా హాజరైన మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ జ్ఞానం పుట్టుక, స్వభావం, పరిమితులు, వాస్తవాలు, విలువలకు మధ్య ఉండే వైరుధ్యాలు, సామాజిక శాస్త్రాల పాత్ర అంశాలపై వివరించారు. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం ఫ్రెంచ్ విప్లవం ద్వారా సమాజానికి పరిచయం అయ్యాయన్నారు. సామాజిక శాస్త్రాలు విలువలకు ప్రాధాన్యం ఇస్తే, సైన్స్ వాస్తవాలకు ప్రాధాన్యం ఇస్తుందన్నారు. ఇవి ఎప్పుడు మారుతుంటాయని, అందుకే సామాజిక శాస్త్రాలను లోతుగా అధ్యయనం చేయవల్సిన అవసరం ఉందని చెప్పారు.. సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి రాజశేఖర్, స్టాఫ్ సెక్రటరీ డాక్టర్ రామమోహన్‌రావు, అధ్యాపకులు బి మహేందర్‌రావు, డాక్టర్ టి శ్రీలత, పిడి సుజాత, ఆర్ ఈశ్వరయ్య, వి స్వరూపరాణి, పి శ్రీనివాస్‌రెడ్డి, ఎల్ రవిందర్, డాక్టర్ రవి ప్రకాష్, డాక్టర్ సుష్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి

హుజూరాబాద్‌రూరల్, జూలై 6: అధ్యాపకులు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందజేయాలని ఎన్ఐటీ వరంగల్ ప్రొఫెసర్ వేణు వినోద్ అన్నారు. మండలంలోని సింగాపూర్ గ్రామంలోని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం కళాశాల డైరెక్టర్ డాక్టర్ కె.శంకర్ అధ్యక్షతన క్వాలిటి ఎం హెస్సమెంట్ ఇన్ టెక్నికల్ అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజానికి అవసరమైన ప్రయోగాలు చేసేలా అధ్యాపకులు తర్ఫీదులు చేయాలన్నారు. శాస్త్రీయ సాంకేతిక జర్నల్స్‌లో మంచి నాణ్యమైన పరిశోధన పత్రాలు సమర్పించాలని, అప్పుడే మాత్రమే విద్యార్థులకు సరైన ఆదునిక పరిజ్ఞానం అందు ‘ందన్నారు. ప్రశ్నపత్రం తయారిలో, ముల్యాం కనంలో శ్రద్ద తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐక్యూఏసి డీన్, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ ఎం.వి సతీష్‌కుమార్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వేణుగోపాల్, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించాలి

జమ్మికుంట రూరల్, జూలై 6: ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కోశాధికారి విష్ణు అన్నారు. శనివారం జమ్మికుంట పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఏఐఎస్ఎఫ్ నాయకులు సందర్శించారు. విద్యార్థులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాలల్లో మధ్యాహ్న బోజనం పథకానికి నిధులు కేటాయించి విద్యార్థులకు మంచి పౌష్టికాహారం అందజేయాలన్నారు. ఉపాధ్యాయ, అటెండర్, స్కావెంజర్, పీటీ, టీచర్ పోస్టులు భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు ఇల్లందుల శ్రీనాథ్, మొలుగూరి వినయ్, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ప్రబలుతున్న సీజనల్ వ్యాధులు

- వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని గ్రామస్థుల వినతి

చిగురుమామిడి, జూలై 6: మండలంలోని 17 గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. దీంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ప్రతీ రోజు సుమారు 80 నుంచి 90 మంది వరకు రోగులు చికిత్స కోసం వస్తు న్న పరిస్థితి నెలకొంది. పలు గ్రామల్లో ప్రజలు దగ్గు, జ్వరం, జలుబుతో ఇబ్బందులు పడు తున్నారు. ఆరోగ్య కేంద్రాలకు వచ్చే రోగులకు ఎలాంటి పరీక్షలు చేయకుండా సిబ్బంది కేవలం మందులు ఇస్తూ సరిపెడుతున్నారని పలువురు వాపోయారు. గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి చికిత్స అందించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

వ్యాధులపై అవగాహన కల్పించాలి..

వైద్యాధికారులు సీజనల్ వ్యాదులపై ప్రజలకు అవగాహన కల్పించాలి. అన్ని గ్రామాల్లో దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి. రోగులకు సరిపడా అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాలి. ప్రభుత్వ అదేశాల మేరకు వైద్య సిబ్బంది ఆస్పత్రిలో ఉండి చికిత్స అందించాలి.

- సీపీఐ మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి

ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం మొదటి సెమిస్టర్ ఫలితాలు విడుదల

గణేశ్‌నగర్,జూలై 6: ఎస్‌యూ పరిధిలోని ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం మొదటి సెమిస్టర్ పరీక్ష ఫలితాలను పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎన్‌వి శ్రీ రంగప్రసాద్ శనివారం విడుదల చేసినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఫలితాలను www.satavahana.ac.in వెబ్‌సైట్‌లో సందర్శించాలని సూచించారు.

రూ. 31.81లక్షల సైబర్ మోసం

సిరిసిల్ల క్రైం, జూలై 6: జిల్లా వ్యాప్తంగా వారం రోజుల్లో రూ. 31.81లక్షలు సైబర్ మోసానికి గురైనట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ శనివారం తెలిపారు. జిల్లా ప్రజలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, సైబర్ నేరాలకు గురైనప్పుడు టోల్ ఫ్రీ నంబరు 1930కి ఫోన్‌చేస్తే వెంటనే చర్యలు తీసుకుంటామని తెలిపారు. సిరిసిల్లలో క్రిప్టో కరెన్సీ, ట్రేడింగ్ పేరిట రూ.2.62లక్షలు, వేములవాడ టౌన్‌లోనూ ట్రేడింగ్ పేరిట రూ.28.75లక్షలు, ముస్తాబాద్‌లో ద్విచక్రవాహనం తక్కువ ధరకే ఇస్తామని నమ్మించి రూ.44, 500 కాజేశారని వివరించారు. ప్రజలు మాయ మాటలు నమ్మి మోసపోవద్దన్నారు.

గోదావరిఖనిలో పోలీసుల తనిఖీలు

● మత్తు పదార్థాల కట్టడికి నార్కోటిక్ శిక్షణ డాగ్స్ వినియోగం

కోల్‌సిటీ, జూలై 6: గోదావరిఖని ఇందిరానగర్‌లో శనివారం తెల్లవారుజామున వన్‌టౌన్ పోలీసులు కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఏసీపీ ఎంరమేష్, వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి, ఎస్ఐలు, సిబ్బంది కాలనీలోని ఇళ్లలో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో మొదటి సారిగా నార్కోటిక్ డాగ్స్‌ను వినియోగించారు. మత్తు పదార్థాలు, గంజాయి వంటి జాడ తెలుసుకునేందుకు వీటిని వినియోగించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ ప్రజల రక్షణ, భద్రత పోలీసుల బాధ్యత అని, కొత్త వ్యక్తులు, నేరస్థులు కాలనీల్లో షెల్టర్ తీసుకుంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. యువత గంజాయి, మద్యం, డ్రగ్స్ వంటి చెడు అలవాట్లకు బానిసై జీవితాన్ని నాశనం చేసుకోవద్దన్నారు. సైబర్ నేరాలు, మోసగాళ్ల ఫోన్‌కాల్స్, మెసేజ్, వాట్సాప్ కాల్స్‌కు స్పందించవద్దన్నారు. ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని, 100నెంబర్‌కు కాల్ చేసి చెప్పాలన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. వాహనాలకు సంబంధించి గృహపత్రాలు కలిగి ఉండాలని, స్వీయ రక్షణ కోసం హెల్మెట్లు ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో వన్‌టౌన్-2 ఇన్‌స్పెక్టర్ లింగమూర్తి, ఎస్ఐలు సమ్మయ్య, శ్రీనివాస్, సుగుణాకర్, గోదావరిఖని టుటౌన్ ఎస్ఐలు సనత్ రెడ్డి, వెంకటేష్ పాల్గొన్నారు.



డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు చేస్తున్న పోలీసులు

అన్నదమ్ముల ఆస్తి తగాదా

● తల్లిని రోడ్డుకు ఈడ్చిన కొడుకులు

సిరిసిల్ల టౌన్, జూలై 6: సొంత అన్నదమ్ముల ఆస్తి తగాదా తొమ్మిది నెలలు మోసి కని పెంచిన తల్లిని రోడ్డున పడేసింది. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో శనివారం చోటు చేసుకున్న సంఘటన స్థానికులను కలిచివేసింది. బాధితురాలి కథనం ప్రకారం.. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని నెహ్రూనగర్‌కు చెందిన యెలిగేటి శకుంతల లక్ష్మీనారాయణ దంపతులకు ముగ్గురు కొడుకులు దామోదర్, రామానుజం, చంద్రశేఖర్. అష్టకష్టాలు పడి పెంచారు. భర్త లక్ష్మీనారాయణ రెండు సంవత్సరాల క్రితం అనారోగ్యంతో మరణించాడు. అనంతరం పెద్ద మనుషుల సమక్షంలో ఉన్న ఇంటిని ముగ్గురు కొడుకులకు మూడు భాగాలు చేసి అందులోనే ఒక గదిలో శంకుతల ఒంటరిగా ఉంటోంది. ముగ్గురు కొడుకుల్లో రెండో కుమారుడు రామానుజం వ్యాపారంలో నష్టం రావడంతో ఇంటిలోని తన భాగాన్ని ఇద్దరు సోదరులకు ధర కట్టి ఇచ్చాడు. కొన్ని డబ్బులు ఇవ్వడంతో అప్పులు కట్టుకొని వేరే ప్రాంతంలో అద్దెకు ఉంటున్నాడు. రెండో కుమారుడు రామానుజంకు మొత్తం డబ్బులు రాకపోవడంతో ఇంటిని రిజిస్ట్రేషన్ చేయలేదు. రామానుజంకు చెప్పి రిజిస్ట్రేషన్ చేయించాలని తల్లి శకుంతలను పెద్ద కొడుకు దామోదరం, చిన్న కొడుకు చంద్రశేఖర్ ఏడు నెలల క్రితం బలవంతంగా ఖాళీ చేయించారు. దీంతో శకుంతల అక్కడే ఓ అద్దె ఇంట్లో నివాసం ఉంది. ఇటీవల శకుంతల అస్వస్థతకు గురవడంతో ఇంటి యజమానులు ఖాళీ చేయాలని ఒత్తిడి చేశారు. దీంతో తన సొంత ఇంట్లోనే ఉంటానని సామగ్రితో శనివారం తిరిగి వచ్చింది. ఇద్దరు కొడుకులు ఇంట్లోకి రాకుండా ఇంటికి తాళం వేయడంతో ఆ తల్లి సామగ్రితో సహా నిరీక్షించింది. పంచాయితీ పోలీస్‌స్టేషన్‌కు చేరింది.



సామగ్రితో ఇంటిబయట తల్లి శకుంతల

సింగరేణిలో 272పోస్టులకు ప్రత్యక్ష నియామకాలు

● ఈ నెల 20, 21తేదీల్లో రాత పరీక్ష

గోదావరిఖని, జూలై 6: సింగరేణి బొగ్గు గనుల సంస్థలో ఆయా విభాగాలలో ఖాళీగా ఉన్న 10కేటగిరీలలో గల 272పోస్టులకు ఈ నెల 20, 21 తేదీల్లో హైదరాబాద్‌లో రాత పరీక్ష నిర్వహించనున్నట్లు సింగరేణి యాజమాన్యం శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. మేనేజ్‌మెంట్ ట్రైనీ(మైనింగ్), మేనేజ్‌మెంట్ ట్రైనీ(ఎఫ్ఏ), మేనేజ్‌మెంట్ ట్రైనీ(పర్సనల్), మేనేజ్‌మెంట్ ట్రైనీ(ఐఈ), జూనియర్ ఎస్టేట్స్ ఆఫీసర్, మేనేజ్‌మెంట్ ట్రైనీ(హైడ్రో జియాలజిస్ట్), మేనేజ్‌మెంట్ ట్రైనీ(సివిల్), జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్, జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్, సబ్ ఓవర్సీస్ ట్రైనీ పోస్టులను ప్రత్యక్ష నియామకాల (ఎక్స్‌టర్నల్) పద్ధతిలో భర్తీ చేయడానికి ఎంప్లాయ్‌మెంట్ నోటిఫికేషన్ నెంబర్ 01/2024 ప్రకారం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 20,21తేదీల్లో హైదరాబాద్‌లో కంప్యూటర్ ఆధారిత పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపింది. అభ్యర్థులు సింగరేణి సంస్థ వెబ్‌సైట్ ద్వారా అడ్మిట్ కార్డ్/హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని, అభ్యర్థుల మెయిల్ ఐడికి కూడా డౌన్లోడ్ చేసుకోవటానికి లింక్ పంపించడం జరిగిందని యాజమాన్యం తెలిపింది. పరీక్ష తేదీ, సమయం, సెంటర్ పేరు హాల్ టికెట్ నందు పోస్టులవారీగా పొందుపరిచామని జీఎం(సెక్యూరిటీ), జిఎం(పర్సనల్) వెల్ఫేర్ , ఆర్‌సీ బీఆర్ దీక్షితులు తెలిపారు. పోస్టులన్నీ కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ) ద్వారా పూర్తిగా మెరిట్‌పై ఆధారపడి ఉంటుందని, దళారులను నమ్మి ఎవరూ మోస పోవద్దని, ఎవరైనా సామాజిక మాధ్యమాలలో మెసేజ్, ఫోన్ చేసి ఉద్యోగాలు ఇప్పిస్తామని చెబితే ప్రలోభాలకు గురికాకుండా సింగరేణి విజిలెన్స్ డిపార్ట్‌మెంట్‌కు తెలియజేయాలన్నారు. అటువంటి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని సంస్థ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్ బలరాం పేర్కొన్నారని వారు తెలిపారు.

కుక్క దాడిలో ఒకరికి తీవ్ర గాయాలు

ఎల్లారెడ్డిపేట, జూలై 6: ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్‌లో శనివారం కుక్క దాడిలో అదే గ్రామానికి చెందిన ఇల్లెందుల రాజిరెడ్డి తీవ్ర గాయాల పాలయ్యాడు. వెంటనే మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రాజిరెడ్డి తన ద్విచక్రవాహనంపై వెళ్తున్న క్రమంలో రోడ్డుపై ఉన్న కుక్క వెంబడించి గాయపరిచింది. గ్రామంలో ఇటీవల కుక్కల బెడద అధికమైందని ప్రజలు పేర్కొంటున్నారు. పది రోజుల కిందట గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల నుంచి ఇంటికి వెళ్తున్న ఐదుగురు విద్యార్థులపై దాడి చేశాయన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు కుక్కల బెడద నుంచి తమను రక్షించాలని కోరుతున్నారు.

ఎస్సారెస్పీలోకి కొనసాగుతున్న వరద

జగిత్యాల, జూలై 6 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల నుంచి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. శనివారం వరద నీరు వచ్చి చేరుతుండడంతో ప్రాజెక్టు నీటి మట్టం క్రమంగా పెరగుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో పాటు, బాబ్లీ గేట్లు ఎత్తివేయడంతో ఎస్ఆర్ఎస్పీ ప్రాజెక్టులోకి 1,736 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 90.323 సామర్థ్యంకు ప్రస్తుతం 11.545 టీఎంసీల నీరు నిల్వఉంది. గత ఏడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 16.405 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 5.840 టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది.

భూవివాదంలో యువకుడి ఆత్మహత్య

ఓదెల, జూలై 6: మండలంలోని జీలకుంటలో వంగల శ్రీకాంత్‌రెడ్డి(36) అనే యువకుడు శనివారం తన ఇంటిలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడని గ్రామస్థులు తెలిపారు. రెండేళ్ల క్రితం శ్రీకాంత్‌రెడ్డి భూమి విషయమై వివాదం ఏర్పడిందని, అప్పటి నుంచి తన భూమి తనకు దక్కుతుందో, లేదో అనే మానసిక వేదనకు గురై ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని గ్రామస్థులు పేర్కొంటున్నారు. ఆత్మహత్య విషయమై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పొత్కపల్లి ఎస్ఐ అశోక్‌రెడ్డి తెలిపారు.

ఒకరిపై దాడి ఘటనలో ఇద్దరి అరెస్టు

చందుర్తి, జూలై 6 : ఒకరిపై దాడి చేసిన సంఘటనలో ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ శ్రీకాంత్ శనివారం తెలిపారు. ఎస్ఐ కథనం ప్రకారం మండలంలోని లింగంపేట గ్రామంలో మల్యాల రవిపై జూన్ 27న ఇదే గ్రామానికి చెందిన మంద గణేష్, కట్కూరి అక్షయ్ లు బీరు సీసా, కర్రలతో దాడికి పాల్పడ్డారు. రవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, అరెస్టు చేసి గణేష్, అక్షయ్‌లను రిమాండ్ కు తరలించినట్లు తెలిపారు.

అనుమానాస్పదంగా ఒకరి మృతి

కరీంనగర్ క్రైం, జూలై 6: సుభాష్‌నగర్‌లో నివాసం ఉంటున్న చిత్తారి రత్నం(52) నోటి నుంచి నురుగులు కక్కుతుండగా శుక్రవారం రాత్రి 11 గంటలకు ఆసుపత్రిలో చేర్పించగా చికిత్సపొందుతూ మృతి చెందాడని మూడో ఠాణా పోలీసులు తెలిపారు. శంకరపట్నం మండలం గద్దెపాకకు చెందిన రత్నం సుభాష్‌నగర్‌లో నివాసం ఉంటూ విద్యుత్‌స్థంభాల సబ్‌కాంట్రాక్టు పనిచేస్తుంటాడని పోలీసులు తెలిపారు. మృతుడి సోదరుడు రాజు ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

రైస్‌మిల్లుపై టాస్క్‌ఫోర్స్ అధికారుల దాడులు

శంకరపట్నం, జూలై 6: శంకరపట్నం మండలంలోని తాడికల్ శివారులో గల రాజరాజేశ్వరి రైస్ మిల్లుపై శనివారం రాత్రి టాస్క్‌ఫోర్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా 2022-23 రబీ సీజన్, 2023-24 ఖరీఫ్ సీజన్, రబీ సీజన్‌లకు సంబందించిన 3.24లక్షల క్వింటాళ్ల ధాన్యాన్ని తనిఖీ చేశారు. 673 క్వింటాళ్ల ధాన్యం తక్కుగా ఉన్నట్లు గుర్తించారు. నెల రోజులలో 673 క్వింటాళ్ల ధాన్యం సీఎంఆర్ ఇవ్వాలని యాజమాన్యాన్ని ఆదేశించి , వారి వద్ద నుంచి అండర్ టేకింగ్ లెటర్ తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో టాస్క్‌ఫోర్స్ అధికారులు లక్ష్మారెడ్డి, జగిత్యాల డీఎం అర్జిరామ్, నయాబ్ తహసీల్దార్ రమేష్‌బాబు, ఏఎస్ఐ సుధాకర్, సివిల్ సప్లై అసిస్టెంట్ మేనేజర్ శ్రీనునాయక్, డీటీసీ వేణు తదితరులు పాల్గొన్నారు.

నరసింహుడి సన్నిధిలో భక్తుల రద్దీ

ధర్మపురి, జూలై 6: ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి సన్నిధిలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. దీంతో శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి, అనుబంధ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భారీగా తరలివచ్చిన భక్తులు గోదావరిలో పుణ్య స్నానాలు ఆచరించారు. అక్కడి నుంచి ఆలయాలకు చేరుకుని స్వామిని దర్శించుకున్నారు. భక్తులు వివిధ రకాల పూజల టిక్కెట్లు కొనుగోలు చేశారు. అభిషేకాది పూజలు, కుంకుమ అర్చనలు, నిత్య కళ్యాణం పూజలు చేయించారు. ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ, సామవేద పండితులు ముత్యాలశర్మ మంత్రోచ్చరణల మధ్య అర్చకులు నిత్య పూజలు అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అర్చకులు పాల్గొన్నారు.



స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు

నరసింహుని సన్నిధిలో జిల్లా అడిషనల్ జడ్జి పూజలు

నరసింహస్వామి దేవాలయాన్ని జిల్లా అడిషనల్ జడ్జి నారాయణ శనివారం సందర్శించారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం వేదపండితులు, అర్చకులు, సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం ఆయన స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు ఆయనను ఘనంగా ఆశీర్వదించారు. ఆలయ సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ జడ్జికి స్వామి శేషవస్త్రం, ప్రసాదాలు బహూకరించి ఆయనను సత్కరించారు. అంతకు ముందు యమ ధర్మరాజు ఆలయం వద్ద గండ దీపంలో నూనె పోసి భక్తి ప్రపత్తులు చాటుకున్నారు. ఆయన వెంట ధర్మపురి కోర్టు జూనియర్ సివిల్ జడ్జి శ్యాంప్రసాద్, ఎస్ఐ ఉదయ్‌కుమార్, ఆలయ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అర్చకులు అశ్విన్‌కుమార్, అభిషేక్ పౌరోహితులు బొజ్జ సంతోష్‌కుమార్, సంపత్‌కుమార్, రాజగోపాల్, అర్చకులు పాల్గొన్నారు.

కళాభారతి.. ఏమిటీ పరిస్థితి

● శిథిలావస్థకు చేరుతున్నా పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



కళాభారతి పక్కన చెత్తా చెదారం



అసంపూర్తిగా మినీ ఆడిటోరియం

కరీంనగర్ కల్చరల్, జూలై 6: ఘన చరిత్ర ఉన్న కళాభారతి నేడు అధ్వాన స్థితికి చేరింది. ఊడిన పై కప్పు పెచ్చులు... విరిగిన కుర్చీలు.. కుంగిన వేదిక.. చెత్తా చెదారంతో అక్కరకురాని వస్తువులకు నిలయంగా మారింది. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ముఖ్యమంత్రి హోదాలో కేసీఆర్ తొలిసారి కరీంనగర్ వచ్చినప్పుడు అన్ని హంగులతో కలెక్టరేట్ హెలిప్యాడ్ ఆవరణలో పెద్ద ఆడిటోరియం నిర్మిస్తామని చెప్పారు. తొలి విడతగా రూ.15 కోట్లు మంజూరు చేస్తూ జీవో విడుదలయ్యింది. టెండర్లకు ఆహ్వానించకపోవడంతో అటు పాత కళాభారతికి మోక్షం దక్కక, కొత్త ఆడిటోరియం నిర్మాణ పనులు మొదలుకాలేదు. 2005లో ఎస్సారార్ కళాశాల ఆవరణలో కళాభారతికి ప్రత్యామ్నాయంగా నిర్మించతలపెట్టిన మినీ రవీంద్రభారతి కలగానే మిగిలిపోయింది.

● ఇదీ చరిత్ర...

1974లో కళాభారతిని నిర్మించారు. అప్పుడు టౌన్‌హాల్‌గా పిలిచేవారు. 1978లో కలెక్టర్‌గా ఉన్న కేఎస్ శర్మ కళాభారతి అని పేరు పెట్టారు. అనంతరం వెనుక భాగంలో ఆడిటోరియం నిర్మించారు. 2005లో మినీ రవీంద్ర భారతిగా అప్‌గ్రేడ్ చేసేందుకు సెంట్రల్ స్కీం కింద రెండు కోట్ల నిధులు కేటాయించారు. తొలి విడత 25 లక్షలు ఇవ్వగానే కాంట్రాక్టర్ పనులు ప్రారంభించాడు. తర్వాత నిధులు రాకపోవడంతో పనులు నిలిపివేశారు. ఈటల రాజేందర్, గంగుల కమలాకర్ మంచి కళాక్షేత్రం కోసం అప్పటి సీఎంతో మాట్లాడుతామని అన్నారు. అది సాకారం కాలేదు. క్రమక్రమంగా కళాభారతి శిథిలావస్థకు చేరుకుంది.



కరీంనగర్‌లోని కళాభారతి



నిరుపయోగంగా మారిన కళాభారతి

చెట్లు నరికిన వారిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

మెట్‌పల్లి రూరల్, జూలై, 6 : మండలంలోని వేంపేట శివారులో గుర్తు తెలియని రైతులు విచక్షణారహితంగా చెట్లను నరికివేయడంతో మెట్‌పల్లి పోలీసుస్టేషన్‌లో కార్యదర్శి ఫిర్యాదు చేశాడు. గ్రామ శివారులో ఉపాధిహామీ పథకంలో భాగంగా రోడ్డుకు ఇరువైపులా నాటిన 150 చెట్లను ఈనెల 1న గుర్తు తెలియని రైతులు నరికివేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. చెట్లు విచక్షణారహితంగా నరికివేసినా ఎలాంటి చర్యలు తీసుకోకుండా ఎంపీడీవో, ఎంపీవో, ఏపీవోలు వ్యవహరించిన తీరుపై జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు మండలంలో చర్చించుకుంటున్నారు. చెట్లు నరికిన విషయంపై సాకులు చెప్పి దాటవేయడం మంచి పద్ధతి కాదని, ప్రభుత్వ అధికారులు జవాబుదారీ తనంగా వ్యవహరించాలని సూచించి చెట్లు నరికి వేసిన వారిపై ఫిర్యాదు చేయాలని హెచ్చరించినట్లు సమాచారం. కలెక్టర్ ఆదేశాల మేరకు కార్యదర్శి మెట్‌పల్లి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. హరితహారం పథకం కోసం ప్రతియేటా ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు పెడుతున్నా అధికారుల నిర్లక్ష్యంతో నాటిన మొక్కలు గొడ్డలి వేటుకు గురువుతున్నాయి.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక

మెట్‌పల్లి రూరల్, జూలై, 6 : మండలంలోని బండలింగాపూర్ ప్రభుత్వ పాఠశాలలో లవంగ భావన అనే విద్యార్థి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ మరిపెల్లి కార్తీక్ శనివారం తెలిపారు. ఇటీవల జిల్లా స్థాయిలో జరిగిన అథ్లెటిక్స్ అండర్ 12లో 100 మీటర్ల పరుగు పందెంలో భావన ప్రథమ బహుమతి గెలుపొంది మొదటి స్థానంలో నిలించింది. హైదరాబాద్ లోని గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలకు నిర్వాహకులు మొదటి స్థానంలో నిలిచిన లవంగ భావనను ఎంపిక చేశారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో ఎంపికైన భావనను ప్రధానోపాధ్యాయుడు జితేందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినం దించారు. పాఠశాల పేరు నిలపాలని భావనకు శుభాకాంక్షలు తెలిపారు.



లవంగ భావన

హోటల్స్, రెస్టారెంట్లలో విస్తృత తనిఖీలు

జగిత్యాల, జూలై 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు హోటల్స్ రెస్టారెంట్లు, ప్రభుత్వ, ప్రయివేటు వసతి గృహాలు, గురుకుల పాఠశాలల్లో శనివారం ఆహార కల్తీ నిరోధక అధికారులు విస్తృతంగా తనిఖీలు చేశారు. సీడ్ పాయింట్, పబ్ రెస్టారెంట్, సుప్రబాత్ రెస్టారెంట్ తదితర రెస్టారెంట్లు, హోటల్స్‌లలో శాంపిల్స్ సేకరించారు. పట్టణ శివారు ప్రాంతంలోని నూకపల్లి వద్ద కన్నయ్య డాల్ అను వ్యక్తి నిర్వహిస్తున్న బాంబే బేకరీలో తనిఖీలు చేశారు. బేకరీలో నిబంధనలకు విరుద్ధంగా రస్క్, ఫ్యామిలీ బిస్కట్, కేక్‌లను తయారీ చేస్తున్నట్లుగా గుర్తించారు. బేకరీపై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ అనూష మాట్లాడుతూ పలు రెస్టారెంట్లు, హోటల్స్‌లలో తనిఖీలు చేసి శాంపిల్స్‌ను సేకరించామని, సంబంధిత శాంపిల్స్‌ను ల్యాబ్‌కు పంపడం జరుగుతుందన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.



బేకరీలో తనిఖీ చేస్తున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్

క్షౌరశాలలకు 250 యూనిట్ల విద్యుత్ సబ్సిడీ ఇవ్వాలి

గణేశ్‌నగర్,జూలై 6: క్షౌరశాలలకు గత ప్రభుత్వం 250 యూనిట్ల కరెంటు సబ్సిడీ ఇచ్చిందని దానిని కొనసాగించేలా చూడాలని జిల్లా నాయీబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో శనివారం టీజీ ఎన్‌పిడిసిఎల్ ఎస్ఈ గంగాధర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘనాయకులు మాట్లాడుతూ కరీంగగర్ జిల్లాలో సుమారు 2500 వరకు సెలూన్ షాపులు ఉన్నాయన్నారు. నాయీ బ్రాహ్మణ సెలూన్లకు, రజకులకు కూడా గత ప్రభుత్వం మాదిరిగానే సబ్సిడీ ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిందన్నారు. కరెంటు సిబ్బంది సెలూన్ల బిల్లు కట్టాలని లేకుంటే విద్యుత్ కనెక్షన్ కట్ చేస్తామని బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

సబ్సిడీ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి మా సమస్యను పరిష్కరించాలని కోరారు. విద్యుత్ సిబ్బంది నాయీబ్రాహ్మణులను, రజకులను విద్యుత్ బిల్లులు చెల్లించాలని వేధించకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు నీలం మొండయ్య నాయీ,జిల్లా ప్రధాన కార్యదర్శి పగడాల జయరాం నాయీ, నగర అధ్యక్షులు జంపాల సంపత్ నాయి,నగర ప్రధాన కార్యదర్శి కంది వెంకటేష్ నాయీ, సంఘం సభ్యులు తదితారులు పాల్గోన్నారు.

ఉద్యోగుల పట్ల అధికార యంత్రాంగం సానుకూలంగా ఉండాలి

● గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు సంతోష్ కుమార్

జగిత్యాల అర్బన్, జూలై 6 : జిల్లాలో పనిచేస్తున్న ఉద్యోగుల పట్ల అధికార యంత్రాంగం సానుకూలంగా వ్యవహరించాల్సిన అవసరముందని గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు గంగుల సంతోష్ కుమార్ కోరారు. శనివారం పట్టణంలోని ఇరిగేషన్ సర్కిల్ కార్యాలయంలో జిల్లా గెజిటెడ్ అధికారుల సంఘం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం చేపడుతున్న ఉద్యోగుల బదిలీలు పారదర్శకంగా నిర్వహించాలని, గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో విధులు నిర్వహించిన వారికి ఒక మాసం వేతనం ఇవ్వాలని, అపరిష్కృతంగా ఉన్న అయిదు డీఏలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల బదిలీపై వెళ్లిన అధికారులను యథాస్థానానికి బదిలీ చేయాలని, సమాన నిష్పత్తి చందాతో ఆరోగ్య పథకం అమలు చేయాలని కోరారు. పీఆర్‌సీ కాలయాపన జరుగుతున్నందున అయిదు శాతం ఐఆర్‌ను ఇరవై శాతానికి పెంచాలని, సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపీఎస్ ప్రవేశపెట్టాలని కోరారు. ఈ సమావేశంలో సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడి రమేశ్, నాయకులు కందుకూరి రవి బాబు, గణేష్, బద్దం రాజేందర్ రెడ్డి, అత్తినేని శ్రీనివాస్, నలీం, డాక్టర్ సతీష్ కుమార్, డాక్టర్ అంజిత్ రెడ్డి, విజేందర్, ఎ. శ్రీనివాస్, డాక్టర్ రాజేందర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సంతోష్‌కుమార్

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ముగ్గురికి జైలు శిక్ష

కరీంనగర్ క్రైం, జూలై 6: డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ముగ్గురు వాహనదారులకు జైలు శిక్ష, జరిమానా పడిందని కరీంనగర్ ట్రాఫిక్ సీఐ కరీంఉల్లాఖాన్ తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతూ తనిఖీలలో పట్టుబడిన 25 మంది వాహనదారులను శనివారం కరీంనగర్ మున్సిఫ్ కోర్టులో హాజరుపరచగా ఒక వ్యక్తికి 7 రోజులు, ఇద్దరు వ్యక్తులకు 3 రోజుల జైలుశిక్ష, మొత్తం 6,500 రూపాయలు జరిమానా విధించారని సీఐ తెలిపారు. మిగతా 22 మంది వాహనదారులకు 33,500 రూపాయలు జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు. వాహనదారులు మద్యం సేవించి వాహనం నడిపితే కేసులు నమోదు చేస్తామన్నారు. నిబంధనలు పాటించి వాహనదారులు అన్ని ధ్రువపత్రాలను కలిగి ఉండాలన్నారు.

కూలిన కాకతీయ కాల్వ రక్షణ గోడలు

● మరమ్మతులు చేపట్టని అధికారులు
● భయాందోళనలో వాహనదారులు

మానకొండూర్, జూలై 6: కరీంనగర్-జమ్మికుంట ప్రధాన రహదారిపై మండలంలోని పోచంపల్లి గ్రామ శివారులో కాకతీయ కాల్వ వంతెన రక్షణ గోడలు కూలిపోయి ఏళ్లు గడుస్తున్నా అధికారులు మరమ్మతులు చేపట్టం లేదు. దీంతో వాహనదారులు భయాందోళనతో రాకపోకలు సాగిస్తున్నారు. కరీంనగర్ నుంచి జమ్మికుంట 45 కిలోమీటర్లు నిత్యం ఆర్టీసీ బస్సులు, లారీలు, ట్రాక్టర్లు, పెద్ద సంఖ్యలో ద్విచక్రవాహనాలు ఈ రహదారిపై రాకపోకలు సాగిస్తుంటాయి. ప్రతి రోజూ కరీంనగర్ నుంచి జమ్మికుంటకు, ఊటూర్‌కు ప్రతి అరగంటకు ఒక్క బస్సు చొప్పున ఆర్టీసీ బస్సులు రాకపోకలు సాగిస్తుంటాయి. కాగా డీబీఎం-6 ప్రధాన కాల్వ వంతెన రక్షణ గోడలు కూలిపోయి ఏళ్లు గడుస్తున్నా సంబంధిత అధికారులు మరమ్మతులు చేపట్టడం లేదు. గతంలో కాల్వ వంతెనపై ఇసుక లారీ వెళ్తున్న సమయంలో వంతెన కుంగిపోయి రాకపోకలు నిలిచిపోయాయి. కాంట్రాక్టర్ తాత్కాలిక మరమ్మతులు చేపట్టి చేతులు దులుపుకున్నారు. రాత్రి వేళల్లో వంతెన మీదుగా వెళుతున్న ద్విచక్రవాహనదారులు కాల్వలో పడిపోతామోనని భయాందోళనలోనే రాకపోకలు సాగించాల్సిన దుస్థితి నెలకొంది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



పోచంపల్లి వద్ద ప్రధాన రహదారిపై కూలిన కాలువ రక్షణ గోడ

ఆరు గ్యారెంటీల అమలులో కాంగ్రెస్ విఫలం

-మేయర్ యాదగిరి సునీల్‌రావు



మాట్లాడుతున్న మేయర్ యాదగిరి సునీల్‌రావు

కరీంనగర్ టౌన్, జూలై 6: ఆరు గ్యారెంటీల అమలులో కాంగ్రెస్ విఫలమైందని మేయర్ యాదగిరి సునీల్‌రావు విమర్శించారు. తాత, తండ్రుల చరిత్ర చెప్పుకొని మూడుసార్లు కరీంనగర్‌లో పోటీచేసి ఓటమి పాలైన హ్యాట్రిక్ వీరుడు వెలిచాల రాజేందర్‌రావు తన చరిత్ర ఏమిటో ఆలోచన చేసుకొని మాట్లాడాలంటూ మండిపడ్డారు. శనివారం నగరంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో విలేకరుల సమావేశంలో సునీల్‌రావు మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో కేడర్ లేక లక్షలు ఇచ్చి కార్పొరేటర్లను కొనుక్కున్న చరిత్ర నీదని విమర్శించారు. నగర అభివృద్ధి విషయంలో ఎక్కడైనా ఫిర్యాదు చేసుకోవచ్చన్నారు. కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చి ఏడు నెలలవుతున్నా ఆరు గ్యారంటీల అమలుకు అతీగతీ లేదని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా కాంగ్రెస్ పార్టీ ప్రజా పాలనపై దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు, నాయకులు వాల రమణారావు, గందె మాధవిమహేశ్, గుగ్గిళ్ళ జయశ్రీ శ్రీనివాస్, కంసాల శ్రీనివాస్, ఎడ్ల సరిత అశోక్, లెక్కల స్వప్న వేణు, కోల మాలతి సంపత్‌కుమార్, తోట రాములు, దిండిగాల మహేశ్, మేచినేని అశోక్‌రావు, కచ్చు రవి, మర్రిభావన సతీష్, తుల శ్రీదేవి చంద్రమౌళి పాల్గొన్నారు.

భానుప్రసాద్‌రావుకు దమ్ముంటే రాజీనామా చేసి గెలవాలి

-సర్దార్ రవీందర్‌సింగ్



మాట్లాడుతున్న మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్

కరీంనగర్ టౌన్, జూలై 6: బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్సీగా గెలిచిన భానుప్రసాద్‌రావుకు దమ్ముంటే ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసి మళ్ళీ గెలువాలని మాజీ మేయర్, సివిల్ సప్లయీస్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ సర్దార్ రవీందర్‌సింగ్ సవాల్ విసిరారు. శనివారం నగరంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఓటు హక్కు లేకున్నా, తెలంగాణ ఉద్యమకారులను కూడా కాదని ఎమ్మెల్సీ టికెట్ ఇచ్చి గెలిపిస్తే ఎవరికి సమాచారం ఇవ్వకుండా అర్ధరాత్రి పార్టీ మారాడన్నారు. భారత రాజ్యాంగాన్ని జేబులో పెట్టుకొని తిరుగుతున్న రాహుల్‌గాంధీకి రాజ్యాంగం పట్ల గౌరవం ఉంటే పార్టీ మెనిఫెస్టోలో పెట్టిన విధంగా వాటిని పార్టీ మారిన వారి చేత రాజీనామా చేయించాలని డిమాండ్ చేశారు. ఈ ఇంటి మీద కాకి ఆ ఇంటి మీద వాలితే కాల్చేస్తా అన్న రేవంత్‌రెడ్డికి తుపాకీ దొరకడం లేదా అని ప్రశ్నించారు. కేకేశవరావుకు ఉన్న పౌరుషం నీకు లేదా, కేకే మాదిరిగా రాజీనామా చేయాలని భానుప్రసాద్‌రావుకు రవీందర్‌సింగ్ డిమాండ్ చేశారు. ఈవిలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు గుంజపడుగు హరిప్రసాద్, కెమసారం తిరుపతి,తదితరులుపాల్గొన్నారు.

ఎమ్మెల్సీ భానుప్రసాద్‌రావు బహిరంగ క్షమాపణ చెప్పాలి

-బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్

కరీంనగర్ టౌన్, జూలై 6: నీకు ఓట్లు వేసి గెలిపించిన స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులందరికీ బహిరంగ క్షమాపణలు చెప్పి ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయాలని ఎమ్మెల్సీ భానుప్రసాద్‌రావును బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ డిమాండ్ చేశారు. లేకుంటే హైదరాబాద్‌కు వచ్చి నీ ఇంటిని ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు. శనివారం నగరంలోని బీఆర్ఎస్ నగర పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో చల్ల హరిశంకర్ ఎమ్మెల్సీ భానుప్రసాద్‌రావుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాజకీయాలను సైతం వ్యాపారంగా చేసే ఘనత భానుప్రసాద్‌రావుదని ఎద్దేవా చేశారు. విలేకరుల సమావేశంలో పార్టీ నాయకులు గడ్డం ప్రశాంత్‌రెడ్డి, గంగాధర చందు, నవాజ్, షౌకత్, వాజిద్, బొనకూర్తి సాయికృష్ణ, ఆరె రవిగౌడ్, చేతి చంద్రశేఖర్, చల్లోజి శ్రీనివాస్, ఒడ్నాల రాజు, సత్తినేని శ్రీనివాస్, నదీమ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఆరోగ్యంపై విద్యార్థినులకు అవగాహన

సుభాష్‌నగర్, జూలై 6: ఆరోగ్యంపై విద్యార్థినీలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. శనివారం స్థానిక వావిలాలపల్లిలోని కాకతీయ పాఠశాలలో మ్యాన్ కైండ్ ఫార్మ ఆధ్వర్యంలో ఆరోగ్యంపై చైతన్యం కార్యక్రమాన్ని నిర్వహించారు. పీరియడ్స్‌పై అపోహలు, తప్పుడు అభిప్రాయాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఏదైనా సమస్య ఉంటే డాక్టర్‌ను సంప్రదించాలని సూచించారు.

నాగార్జున డెయిరీ మేనేజింగ్ డైరెక్టర్‌కు డాక్టరేట్



ఢిల్లీలో డాక్టరేట్ అందుకుంటున్న పుల్లూరి ప్రభాకర్‌రావు

హుజూరాబాద్, జూలై 6: హుజూరాబాద్ పట్టణానికి చెందిన నాగార్జున డెయిరీ మేనేజింగ్ డైరెక్టర్ పుల్లూరి ప్రభాకర్‌రావు శనివారం డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. ప్రభాకర్‌రావు 18ఏళ్లుగా నాగార్జున డెయిరీ స్థాపించి రైతులకు వినియోగదారులకు నాణ్యమైన సేవలందిస్తూ, ప్రత్యక్షంగా, పరోక్షంగా కొన్ని వేల మందికి ఉపాధి కల్పిస్తున్నారు. ఇందుకు గాను వాషింగ్టన్ డిజిటల్ యూనివర్సిటీ వారు ఢిల్లీలో ప్రభాకర్‌రావుకు డాక్టరేట్‌ను అందజేశారు. ప్రభాకర్‌రావు డాక్టరేట్ అందుకోవడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

మానకొండూర్ సీఐగా సదన్‌కుమార్

మానకొండూర్, జూలై 6: మానకొండూర్ సీఐగా జి సదన్‌కుమార్ శనివారం రాత్రి నియమించారు. ఇక్కడ పని చేసిన ఎం రాజ్‌కుమార్ టాస్క్‌ఫోర్స్ 2 మంచిర్యాల రామగుండం కమిషనరేట్ విభాగానికి బదిలీపై వెళ్లారు.

'పారమిత'లో ఘనంగా స్వాగత్ ఉత్సవం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ప్రసాదరావు

తిమ్మాపూర్, జూలై 6: కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని అలుగునూర్‌లో గల పారమిత వరల్డ్ స్కూల్‌లో స్వాగత్ ఉత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పారమిత పాఠశాల ఛైర్మన్ ఈ ప్రసాదరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పారమిత వరల్డ్ స్కూల్ విద్యార్థులు స్వాగత్ పేరుతో నూతన విద్యార్థులకు స్వాగతం పలికారని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు ప్రసూన, వీయూపీ ప్రసాద్, అనుకర్‌రావు, వినోద్‌రావు, ప్రిన్సిపాల్ శ్రీకర్ తదితరులు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళి



కరీంనగర్‌లో జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కరీంనగర్ అర్బన్, జూలై 6: మాజీ ఉప ప్రధానమంత్రి జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా నగర కాంగ్రెస్ కార్యాలయంలో పలువురు నాయకులు ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు. కార్యక్ర మంలో కాంగ్రెస్ నాయకులు కొరివి అరుణ్ కుమార్, శ్రవణ్ నాయక్, చర్ల పద్మ, గుండాటి శ్రీనివాస్‌రెడ్డి, కుర్ర పోచయ్య, పోరండ్ల రమేష్, గాలి అనిల్ కుమార్, దీకొండ శేఖర్, నాగుల సతీష్, విద్యాసాగర్, గణపతి, గంగుల దిలీప్, దన్నసింగ్, షేక్ షేహెన్‌షా, ముక్క భాస్కర్, మేకల నరసయ్య పాల్గొన్నారు.

●డీసీసీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమానికి కరీంనగర్ నియోజకవర్గ ఇంచార్జి పురుమల్ల శ్రీనివాస్, డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, పీసీసీ కార్యదర్శి వైద్యులు అంజన్ కుమార్, జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షులు కోరివి అరుణ్ కుమార్‌లు బాబు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం నగర కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షులు లింగంపల్లి బాబు ఆధ్వర్యంలో జగ్జీవన్ రామ్ విగ్రహానికి పురుమల్ల శ్రీనివాస్, కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, లింగంపల్లి బాబు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు చర్ల పద్మ, పులి ఆంజనేయులుగౌడ్, బానోతు శ్రావణ్ నాయక్, సిరాజ్ హుస్సేన్, వెన్న రాజ మల్లయ్య, అహ్మద్ అలీ, కుర్ర పోచయ్య, బొబ్బిలి విక్టర్, కల్వల రామచందర్, వంగల విద్యాసాగర్ పాల్గొన్నారు.

●భగత్‌నగర్: నగరంలోని రేకుర్తి 18వ డివిజన్‌లో బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా కార్యదర్శి జాడి బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతిని నిర్వహించారు. పశ్చిమ డివిజన్‌లోని రేకుర్తి కంటి ఆసుపత్రి చౌరస్తాలో ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో పశ్చిమ జోన్ మాజీ అధ్యక్షుడు నరహరి లక్ష్మారెడ్డి, జానపట్ల స్వామి, ఎడమ సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

●సుభాష్‌నగర్: దళితుల రాజకీయ చైతన్యమే బాబు జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళి అని కార్పొరేటర్ కంసాల శ్రీనివాస్ అన్నారు. మంచిర్యాల చౌరస్తాలోని బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.కార్యక్రమంలో తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు సముద్రాల అజయ్, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడి మహేశ్, గజ్జల ఆనందరావు, గోష్కి శంకర్, కోండ్ర స్వరూప, మారుమూల సాంబయ్య, దరిపెల్లి క్రాంతి పాల్గొన్నారు.

●హుజూరాబాద్: పట్టణంలోని కరీంనగర్ రోడ్‌లో జగ్జీవన్‌రాం చౌరస్తాలో బాబు జగ్జీవన్‌రాం వర్ధంతిని జయంత్యుత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నాయకులు జగ్జీవన్‌రాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ గందె రాధిక, బండ శ్రీనివాస్, రొంటాల సుమన్, రత్నం, శ్రీనివాస్, మహ్మద్ ఖలీక్‌హుస్సేన్, దయాకర్, శ్రీధర్, శేఖర్, సమ్మయ్య, జనార్ధన్, ప్రభాకర్, సారయ్య పాల్గొన్నారు.

●మానకొండూర్: మండల కేంద్రంలో బాబూ జగ్జీవన్‌రాం వర్ధంతిని నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావులు వేర్వేరుగా జగ్జీవన్‌రాం విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ తాల్లపల్లి శేఖర్‌గౌడ్, నిర్వహణ కమిటీ అధ్యక్షుడు రొడ్డ ఆంజనేయులు, కాంగ్రెస్ నాయకులు సయ్యద్ సాజిద్, మడుపు ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

కాల్వ నర్సయ్య సేవలు చిర స్మరణీయం

సుభాష్‌నగర్, జూలై 6: కాల్వ నర్సయ్య సేవలు చిర స్మరణీయమని అఖిల భారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు దుండ్ర రాజయ్య అన్నారు. శనివారం నగరంలోని యాదవ విద్యార్థి భవనం ఆవరణలో ఏర్పాటు చేసిన కాల్వ నర్సయ్య విగ్రహన్ని కుటుంబ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జంగిలి ఐలేందర్, కాంగ్రెస్ నాయకుడు పురమల్ల శ్రీనివాస్, కన్నవేణి ఓదేలు, పుట్టపాక శ్రీనివాస్, బాబూర్ కుమార్, గాలి రవి, సందబోయిన ప్రసాద్, గాదం శ్రీనివాస్, బండి మల్లయ్య, జంగా కొమురయ్య, ముక్కెర కొమురయ్య, కొండ రవి, కడారి ఐలయ్య, చిగుర్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

●కరీంనగర్ రూరల్: శ్రీకృష్ణ ప్రాథమిక గొర్లపెంపకందారుల, వృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో కరీంనగర్ రూరల్ మండలం బొమ్మకల్ గ్రామంలో వేడుకలను నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు కాల్వ మల్లేశం యాదవ్ ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈకార్య క్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు శ్యామల కొమురయ్య యాదవ్, ఉపాధ్యక్షుడు కుటుంబ శంకర్, కాల్వ మల్లేశం, మేకల చిన్నబీరయ్య, ప్రధాన కార్యదర్శి మల్లయ్య యాదవ్, కోశాధికారి భూస శంకర్, సాహిత్య కార్యదర్శి ఆసిరి మల్లేశం, నలువాల సదానందం, బాగోతం చిన్న వీరయ్య, కాల్వ శ్రీనివాస్, పుట్టపాక రాజ్‌కుమార్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తలు నిరసనలో పాల్గొనాలి

సుభాష్‌నగర్, జూలై 6: ఆశా కార్యకర్తలు జూలై 10 డిమాండ్స్ డే సందర్భంగా నిరసనలో పాల్గొంటారని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేశ్ తెలిపారు. శనివారం వైద్యఆరోగ్యశాఖ అధికారి కార్యలయంలో ఏవోకు వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 10 సీఐటీయూ ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా డిమాండ్ డే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ప్రతి కార్మికునికి రూ. 26వేల కనీస వేతనం ఇవ్వాలని నిర్ణయించిందని తెలిపారు. ఆశా కార్యకర్తలను కార్మికులుగా గుర్తించాలన్నారు. డిమాండ్ల సాధన కోసం చేపట్టే సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నగర కన్వీనర్ పుల్లెల మల్లయ్య, ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మారెళ్ళ శ్రీలత, కవిత, రజిత, వనజ పాల్గొన్నారు.

12న సాయిబాబా ఆలయ హుండీల లెక్కింపు

కరీంనగర్ కల్చరల్, జూలై6: నగరంలోని సాయినగర్ విజయగణపతి సాయిబాబా దేవాలయ హుండీలను శుక్రవారం ఉదయం 10 గంటలకు లెక్కించనున్నట్లు ఈఓ ఎండపెల్లి మారుతి ఒక ప్రకటనలో తెలిపారు. సిబ్బందితో పాటు జౌత్సాహిక భక్తులు కూడా పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

'అవినీతి పరుల భరతం పడతాం'



మాట్లాడుతున్న కరీంనగర్ పార్లమెంట్ కాంగ్రెస్ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు

సుభాష్‌నగర్, జూలై6: కరీంనగర్ కార్పొరేషన్‌లో జరుగుతున్న అవినీతిని కాంగ్రెస్ ప్రభుత్వం బయటపెడుతుందని ఆ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు అన్నారు. శనివారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రిప్రాం కరీంనగర్ కార్పొరేషన్, క్లీన్ ఆఫ్ కరీంనగర్ కార్పొరేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించాలని నిర్ణయించినట్లు తెలిపారు. గుడ్‌మార్నింగ్ కరీంనగర్ ద్వారా ప్రతి రోజు ఒక్క డివిజన్‌కు వెళ్ళి అక్కడి సమస్యలు తెలుసుకుంటామని తెలిపారు. కార్పొరేషన్ పరిధిలో జరిగిన భూకబ్జాలు ఇతర అవినీతిపై ఫిర్యాదులు వస్తే మంత్రి పొన్నం ప్రభాకర్ ద్వారా సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళతామన్నారు. ఈ సమావేశంలో డీసీసీ వర్కింగ్ ప్రసిడెంట్ కొమటిరెడ్డి పద్మకర్ రెడ్డి, వైద్యుల అంజన్‌కుమార్, ఆకుల ప్రకాష్, కాశెట్టి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

'సమస్యల పరిష్కారానికి గుడ్‌మార్నింగ్ కరీంనగర్'

కరీంనగర్ అర్బన్, జూలై 6: నగరంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం 'గుడ్‌మార్నింగ్ కరీంనగర్ కార్యక్రమం చేపట్టానని వెలిచాల రాజేందర్‌రావు తెలిపారు. మొదటి రోజు శనివారం ఆయన కార్పొరేటర్లు, కాంగ్రెస్ నాయకులతో కలిసి అంబేద్కర్ స్టేడియంలో వాకింగ్ చేస్తూ వాకర్స్‌ను, క్రీడాకారులను, యువకులు, ఆర్మీ కోచింగ్ తీసుకునే నిరుద్యోగులను కలసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, కాంగ్రెస్ నాయకులు నేతికుంట యాదయ్య, కాశెట్టి శ్రీనివాస్, ఆకుల ప్రకాష్, సరిళ్ళప్రసాద్, ఉమాపతి, పడిశెట్టి భూమయ్య, వాకర్స్, పాల్గొన్నారు.

'చెస్‌తో మేధాశక్తి పెంపొందుతుంది'



మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్‌స్పోర్ట్స్, జూలై 6 : చెస్‌తో మేధాశక్తి పెంపొందుతుందని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. భారత యువ చెస్ సంచలనం, గ్రాండ్ మాస్టర్ ప్రజ్ఞా నందను విద్యార్థులు ఆదర్శంగా తీసుకొని చెస్‌లో రాణించాలని కలెక్టర్ సూచించారు. శనివారం తిమ్మాపూర్ మండలం అలుగు నూరు గ్రామంలోని లక్ష్మీనరసింహ గార్డెన్లో జీనియస్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తెలంగాణ స్టేట్ ఓపెన్ అండ్ యూ-13 చెస్ టోర్నమెంట్‌ను కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు ఏ రంగంపై ఆసక్తి ఉంటుందో ఆ రంగంపై తల్లిదండ్రులు ప్రోత్సహించాలని పేర్కొన్నారు. అంతకు ముందు జ్యోతి ప్రజ్వలన చేసి చెస్ టోర్నమెంట్‌ను జిల్లా కలెక్టర్ ప్రారంభించారు.ఈ టోర్నమెంట్ కు వివిధ జిల్లాల నుంచి విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో టీఎస్టీవోస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దారం శ్రీనివాస్‌రెడ్డి, సంగెం లక్ష్మణరావు, కార్పొరేటర్ కమల్జిత్ కౌర్, తహసిల్దార్ కనకయ్య జీనియస్ చెస్ అకాడమీ టోర్నమెంట్ డైరెక్టర్ కంకటి అనుప్, ఫౌండర్ కంకటి కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

శ్యామాప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళి



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు బాస సత్యనారాయణరావు

భగత్‌నగర్, జూలై 6: జిల్లాలోని పలు చోట్ల శనివారం శ్యామాప్రసాద్ ముఖర్జీ చిత్రపటాలకు పలువురు బీజేపీ నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. నగరంలోని బీజేపీపార్టీ కార్యాలయంలో డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా శనివారం ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు బాస సత్యనారాయణరావు మాట్లాడుతూ దేశం కోసం, జమ్ముకశ్మీర్ స్వేచ్ఛ, స్వాతంత్ర్యం కోసం తపించి భారతవని కోసం ప్రాణాలర్పించిన గొప్ప నాయకుడు శ్యామాప్రసాద్ ముఖర్జీ అని కొనియారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వినర్ దుబాల శ్రీనివాస్, పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్‌రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాజేంద్రప్రసాద్, మాజీ ఎంపీపీ వాసాలరమేష్, ఉపాధ్యక్షుడు కన్న కృష్ణ, కార్పోరేటర్లు కొలగాని శ్రీనివాస్, కాసర్ల ఆనంద్, మండల అధ్యక్షులు రతన్‌కుమార్, సంతోష్, శివ తదితరులు పాల్గొన్నారు.

● శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా బీజేపీ పశ్చిమ జోన్ ఉద్యమ అధ్యక్షుడు నరహరి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లుఅర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు జానపట్ల స్వామి, ఎడమ సత్యనారాయణరెడ్డి, గుంజేటి శివకుమార్, బూత్ అధ్యక్షులు అంజనేయులు, మల్లేశం, తదితరులు పాల్గొన్నారు. శ్యాంప్రసాద్ జయంతిని పురస్కరించుకుని విద్యానగర్ 17వ డివిజన్‌లో నరహరి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో అమ్మ పేరుతో మొక్కను నాటారు.

● రేకుర్తి 18వ డివిజన్‌లో బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా కార్యదర్శి జాడి బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విష్ణు ప్రసాద్‌రావు, ఎర్రోళ్ల ప్రశాంత్, గోదారి నరేష్, అస్తపురం అంజయ్య, ఆంజనేయులు, సమ్మయ్య, మజీద్, దేవరాజు, వెంకటేష్ పాల్గొన్నారు.

● శంకరపట్నం: మండల కేంద్రంలో బీజేపీ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలను పురస్కరించుకుని బీజేపీ మండలాధ్యక్షుడు ఏనుగుల అనిల్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామపంచాయతీ కార్మికులకు, బాటసారులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు అలివేలు సమ్మిరెడ్డి, దాసారపు నరేందర్, పల్లె శివారెడ్డి, రాసమల్ల శ్రీనివాస్, మొలుగూరి ప్రశాంత్, బిజిలి సారయ్య, గూళ్ల రాజు, గొల్లిపెల్లి శ్రీనివాస్, అరవింద్, వంగ రాజు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టీల్ ప్లేట్ల పంపిణీ

హుజూరాబాద్‌రూరల్, జూలై 6: మండలంలోని సిర్సప ల్లి గ్రామంలోని ఎస్సీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ తరఫున గురువారం స్టీల్ ప్లేట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ నిర్వాహకుడు గంగిశెట్టి, హెచ్‌ఎం మధురమ్మ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు అందజేత

జమ్మికుంట రూరల్, జూలై 6: జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లిలో గల స్పందన అనాథ శరణాలయంలో పల్లె లవ్‌కుమార్‌గౌడ్ - విజయలక్ష్మి దంపతుల మనువడు నిదాన్స్ జన్మదినం సందర్భంగా విద్యార్థులకు నిత్యావసర సరుకులు, అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కేకు కట్ చేసి పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో శరణాలం నిర్వాహకులు గోపరాజు వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

బ్రిడ్జిని ప్రారంభించాలి

రామడుగు, జూలై 6: మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన బ్రిడ్జిని వెంటనే ప్రారంభించాలని కోరుతూ బీజేపీ యువమోర్చా మండల అధ్యక్షుడు దూరుశెట్టి రమేశ్ ఆధ్వర్యంలో శనివారం తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ పాత బ్రిడ్జి గత సంవత్సరం వర్షకాలంలో పూర్తిగా కుంగిపోయిందని చెప్పారు. కొత్త బ్రిడ్జి పనులు పూర్తి చేసి ఐదు సంవత్సరాలు అవుతున్నా ప్రారంభించలేదన్నారు. వెంటనే ప్రారంభించాలని కోరారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శులు పోచంపల్లి నరేష్, పురేళ్ల శ్రీకాంత్‌గౌడ్, యువ మోర్చా జిల్లా కార్యవర్గ సభ్యులు ఎడవెల్లి రామ్, యువ మోర్చా మండల ప్రధాన కార్యదర్శులు ఎడవెల్లి లక్ష్మణ్, దయ్యాల రాజు, మండల ఉపాధ్యక్షులు బండారి శ్రీనివాస్, సామల చందు, మండల కోశాధికారి పూరుకొండ అనిల్, బూత్ కమిటీ అధ్యక్షులు కడారి శ్రీనివాస్, వేముల శ్రీనివాస్, సీనియర్ నాయకులు బొజ్జ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

సర్వాయి పాపన్న మోకు దెబ్బ అధ్యక్షుడిగా జితేందర్‌గౌడ్

ఇల్లందకుంట, జూలై 6: ఇల్లందకుంట మండల సర్వాయి పాపన్న మోకు దెబ్బ మండలాధ్యక్షుడిగా టేకుర్తి గ్రామానికి చెందిన తోడేటి జితేందర్‌గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆ సంఘం జిల్లా యువజన సంఘం అధ్యక్షుడు సమ్మెట ప్రవీణ్ ఆధ్వర్యంలో మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వాయి పాపన్న మోకు దెబ్బ మండలాధ్యక్షుడిగా జితేందర్‌గౌడ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గణేశ్‌నగర్, జూలై 6: నగరంలో చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా ఆదివారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వివిధ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు టౌన్ టు ఏడీఈ సుధీర్ కుమార్ తెలిపారు. కలెక్టరేట్ కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న ప్రాంతం, బస్టాండ్ ప్రాంతం, టౌన్ పోలీస్ స్టేషన్ ప్రాంతం, మార్వాడి ఆలయ ప్రాంతం, ధోబీవాడా, పోలీస్ హెడ్ క్వార్టర్స్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు అల్ఫోర్స్ విద్యార్థులు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో అల్ఫోర్స్ ఛైర్మన్ నరేందర్‌రెడ్డి

భగత్‌నగర్, జూలై 6: రాష్ట్రస్థాయి పోటీలకు కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఈ-టెక్నో పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. శనివారం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులను అల్ఫోర్స్ విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ వి నరేందర్‌రెడ్డి అభినందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 5వ తేదీన జిల్లా కేంద్రంలో ఫుట్‌బాల్ అసోసియేషన్ నిర్వహించిన ఫుట్‌బాల్ జిల్లా స్థాయి పోటీల్లో పాఠశాలకు చెందిన బి సహస్రరెడ్డి, డి సుస్మితారెడ్డిలు అత్యుత్తమ ప్రదర్శనతో రాష్ట్ర స్థాయి పోటీలకుఎంపికయ్యారు. ఈ నెల 12, 13, 14 తేదీల్లో మహబూబ్‌నగర్‌లో నిర్వహించే రాష్ట్ర స్థాయి అర్హత పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించడం గొప్ప విషయమన్నారు.

వింధ్యావాలిలో లీడర్‌షిప్ ఎన్నికలు



ఓటు హక్కు వినియోగించుకున్న బాలికలు

కరీంనగర్‌స్పోర్ట్స్, జూలై 6: జిల్లా కేంద్రంలోని మెహర్ నగర్ వింధ్యావాలి ఉన్నత పాఠశాలలో శనివారం పాఠశాల విద్యార్థి కౌన్సిల్ ఎన్నికలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పాఠశాల ఛైర్మన్ రామవరం లక్ష్మీ ప్రకాష్ రావు ప్రారంభించి మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో ఎన్నికల ప్రాధాన్యతను వివరించారు. అనంతరం స్కూల్‌లీడర్-1 లీడర్-2 లతోపాటు రోజస్, డాఫిడిల్స్, బ్లూబెల్స్, శ్యామ్ రాక్స్‌హౌజ్‌ల లీడర్స్‌కు ఎన్నికలను బ్యాలెట్ పేపర్స్, బాక్సులతో నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వైస్ ఛైర్మన్ రామవరం పృథ్వీరావు, ప్రిన్సిపాల్ జి.ప్రశాంత్ పాల్గొన్నారు.

ఆషాఢ వన భోజనాలు

కరీంనగర్ కల్చరల్, జూలై 6: పద్మనాయక వెల్మ సంఘం ఆధ్వర్యంలో శనివారం ఉజ్వల పార్కులో ఆషాఢ మాస వన భోజనాలను ఘనంగా నిర్వహించారు. మేయర్ సతీమణి యాదగిరి అపర్ణాసునీల్‌రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మహిళలందరూ కలసి హాయిగా కబుర్లు, కాలక్షేపాలతో సందడిగా గడిపారు. ఈ కార్యక్రమంలో వెలమ సంఘం కుటుంబాల మహిళలు, యువతులు పాల్గొన్నారు.

సైకిల్ ర్యాలీకి ఆహ్వానం

కరీంనగర్ అర్బన్, జూలై 6 : తెలంగాణ పేపర్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు సంజీవ్ బల్దువ శనివారం సచివాలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణలను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈనెల 28వ తేదీన తెలంగాణ పేపర్ మర్చంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నక్లెస్ రోడ్‌లో నిర్వహించే సైకిల్ ర్యాలీలో పాల్గొనాల్సిందిగా వారిని ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ పేపర్ మర్చంట్స్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

వైభవంగా శోభాయాత్ర

-కరీంనగర్ కల్చరల్, జూలై 6: నగరంలోని అశోక్‌నగర్ మళయాళ సద్గురు గీతామందిరం పీఠాధిపతి విష్ణుసేవానందగిరి స్వామి ఆధ్వర్యంలో గీతాభక్త సమాజం నేతృత్వంలో శనివారం గీతామందిరం నుంచి శోభాయాత్ర కన్నుల పండువలా నిర్వహించారు. శ్రీకృష్ణుని రథం ముందు విష్ణుసేవానందగిరిస్వామి, సంపూర్ణానందగిరిస్వామి కొబ్బరి కాయలు కొట్టి శోభాయాత్రను ప్రారంభించారు. యాత్ర గీతామందిరం నుంచి ప్రారంభమై పాతబజార్ శివాలయం, ప్రకాశంగంజ్, టవర్‌సర్కిల్ ద్వారా వైశ్యభవన్ చేరుకుంది. కార్యక్రమంలో కన్వీనర్ బండ సత్తయ్య, కోకన్వీనర్‌లు కొమురవెల్లి వేంకటేశం, రాచమల్ల ఆంజనేయులు, ఉప్పల రామేశం, గుండ రాధాకిషన్, సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

జునోసిస్ వ్యాధులపై అవగాహన

సుభాష్‌నగర్, జూలై 6: మంకమ్మతోట లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో జునోసిస్ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. స్థానిక రాంనగర్ ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో వ్యాధుల వల్ల ఏర్పడే సమస్యలను వివరించారు. ఈ కార్యక్ర మంలో క్లబ్ అధ్యక్షుడు బూర్ల విద్యాసాగర్, కార్యదర్శి అంబటి రవీందర్‌రాజు, కోశాధికారి పాత విశ్వనాథం, జోనల్ ఛైర్మెన్ ఎన్నమాదవుని పవనసుత రాజు, పీజెడ్‌సీ జిల్లా అంజయ్య పాల్గొన్నారు.

● సంక్షిప్త సమాచారం..

●గణేశ్‌నగర్: ఆర్మ్ స్ట్రాంగ్ హత్యను నిరసిస్తూ తమిళనాడు ప్రభుత్వంకు వ్యతిరేకంగా, కేంద్ర ప్రభుత్వంకు వ్యతిరేకంగా బహుజన్ సమాజ్‌పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణ చౌక్‌లో కొవ్వొత్తులతో ఆయనకు ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అడ్వకేట్ నిషాని రామచంద్రం మాట్లాడుతూ దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక మత పరమైన హత్యలు ఎక్కువయ్యాయన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇంచార్జిలు మంద బాలయ్య కళ్లేపల్లి రాజేందర్ జిల్లా కమిటీ సభ్యులు జిల్లా కోశాధికారి గిన్నారపు మహేందర్ గోపు భాస్కర్ కురుమ పాల్గొన్నారు.

●సుభాష్‌నగర్: రామడుగు ఎస్ఐపై చేసిన అసత్యపు ఆరోపణలను ఖండిస్తున్నామని కుల సంఘాల నాయకులు అన్నారు. శనివారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రామడుగు మండలం వెలిచాల గ్రామానికి చెందిన కుతాడి కనకయ్యను విచారణ పేరిట రామడుగు ఎస్ఐ పోలీసు స్టేషన్‌కు పిలిపించి మందలించాడని, నేరం ఒప్పుకున్న తరువాతనే అతనికి నోటీసు ఇచ్చి పంపించినట్లు తెలిపారు. అయితే కేవలం కక్ష పూరితంగానే ఆయనపై అసత్యపు ఆరోపణ చేస్తున్నారని అన్నారు. సమావేశంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంఘాల నాయకులు తడగొండ సత్యరాజ్‌వర్మ, సుద్దాల లక్ష్మన్, ఆది మల్లేశం, దార స్వరూప, గోష్కి అజయ్ పాల్గొన్నారు.

●కరీంనగర్ కల్చరల్: డ్రగ్స్ మాఫియా పట్ల జాగ్రత్త వహించాలని, యువత చెడు వ్యసనాల బారిన పడి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని కరీంనగర్ ఫిలిం సొసైటీ ప్రధాన కార్యదర్శి లక్ష్మీగౌతమ్ అన్నారు. శనివారం ఫిలింభవన్‌లో ప్రముఖ గాయకుడు కనపర్తి శ్రీనివాస్ నిర్మాత, దర్శకునిగా మాదక ద్రవ్యం భవితకు ప్రమాదం అనే లఘు చిత్ర ప్రదర్శనకు ఆయన అతిథిగా హాజరై మాట్లాడారు.